క్లుప్తంగా

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పొన్నూరు: పట్టణంలోని నిడుబ్రోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈ నెల 29న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేష్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని 11 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, గ్యాస్ట్రిక్, కంటి సమస్యలు, జనరల్ సర్జన్, ప్రసూతి, గుండె సంబంధిత సమస్యలు, తదితర ఆరోగ్య సమస్యలకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పొన్నూరు, మండల ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ రేష్మ సూచించారు.

మేళ తాళాల మధ్య గణనాథుడి నిమజ్జనం



కాకుమాను: మండల కేంద్రం కాకుమాను శ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యను బుధవారం కనక తప్పెట్లు, మేళ తాళాల మధ్య నిమజ్జనానికి తరలించారు. యూత్ ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాల నుంచి ఏటా ఏక దంతుణ్ని దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసి స్వామి వారిపై తమకున్న భక్తిశ్రద్ధలను యూత్ సభ్యులు చాటుకుంటున్నారు. స్వామి వారిని విశేషంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో పూజలు నిర్వహించి అప్పాపురం గ్రామంలోని కొమ్మమూరు చానల్‌లో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేద ముస్లింలకు అంజుమన్ చేయూత



పొన్నూరు: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద ముస్లింల వివాహానికి పలు వస్తువులు, నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ (మాము) పాల్గొని మహిళలు ముగ్గురికి రూ.30 వేలు, మరో ఇరువురికి వస్తువులు అందజేశారు. అర్బన్ సీఐ ఎండీ అల్తాఫ్ హుస్సేన్ పాల్గొని ముస్లిం మహిళలకు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సైఫుల్లా, కమిటీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: ఇంటి యజమాని బాత్‌రూములో ఉండగా అగంతకుడు బాత్‌రూము తలుపు బయటగడిపెట్టి ఇంట్లో చోరీ చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రమౌళినగర్‌లో నివాసం ఉండే కారుమూరి అనురాధ ఇంటి బయట తలుపులు వేయకుండా బాత్‌రూములో స్నానానికి వెళ్లింది. గుర్తుతెలియని అగంతకుడు బాత్‌రూము తలుపు బయట గడియపెట్టి బీరువా తాళాలు తీసి అందులోని రూ. 2.50 లక్షలు విలువ చేసే బంగారు నగలు, నగదు చోరీ చేశాడు. అనురాధ బాత్‌రూము తలుపు రాకపోవడంతో పెద్దగా కేకలు వేయడంతో అపార్టుమెంట్ వాచ్‌మెన్ వచ్చి తలుపు తీశాడు. బీరువా పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 159వ సచివాలయంలో కన్వీనర్‌గా పనిచేసే కృపాదానం బుధవారం శివనాగరాజు కాలనీలో ఉండగా, అదే ప్రాంతానికి చెందిన చావ వెంకటేశ్వర్లు కృపాదానం వద్దకు వచ్చాడు. తన రేషన్ కార్డు ఎందుకు రద్దు చేశావంటూ కృపాదానంను కులం పేరుతో దూషించాడు. కృపాదానం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టులపై అరెస్టు

గుంటూరు లీగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్.కె.రోజాపై ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టిన పాత గుంటూరులోని అలీనగర్‌కు చెందిన ఉప్పల పంచు అజయ్ దీప్‌ను పాత గుంటూరు పీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు అజయ్ దీప్ ప్రైవేటు బ్యాంక్‌లో పర్సనల్ బ్యాంకర్‌గా లక్ష్మీపురంలో పని చేస్తున్నాడు. ఈ నెల 23న తన ట్విట్టర్ ఖాతాలో మంత్రి రోజాకు సంబంధించి అసభ్యకర సందేశాలు, ఫొటోలు పోస్టు చేశాడు. దీనిపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో రాష్ట్ర ముఖ్యమంత్రికి సంబంధించి కొన్ని అసభ్యకర పోస్టింగ్స్ పెట్టినట్లు కనుగొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నవ్యశ్రీ రూ.20 వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

మట్టి కళాకృతులు తయారు చేసిన విద్యార్థులు



మట్టితో కళాకృతులు తయారు చేస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్ : ప్రాచీన కళలు భారతీయ సంస్కృతికి ప్రతి రూపాలని, వాటి చరిత్ర, ప్రాముఖ్యతపై నేటి తరం విద్యార్థులకు అవగాహన కల్పించడం అవసరమని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో 'టెర్రా కోట పాటరీ' తయారీపై వర్కుషాప్ నిర్వహించారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో మట్టి కళాకృతుల తయారీలో నిష్ణాతులైన మదనపల్లెకు చెందిన కళాకారుడు శ్రీ బాలాజీ కళాశాలలోని విద్యార్థులతో వివిధ మట్టి కళాకృతులను తయారు చేయించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రసార మాధ్యమాల్లో మాత్రమే వీక్షించే ప్రాచీన కళల్లో ఒకటైన మట్టి కళాకృతుల తయారీ విధానాన్ని నేరుగా చూడటమే కాకుండా, స్వయంగా తమ చేతులతో వివిధ రకాల మట్టి వస్తువులను తయారు చేయడం ఎంతో ఆనందం కలిగించిందని విద్యార్థులు తెలిపారు. ఇది జీవితంలో ఒక మరువలేని అనుభూతిగా గుర్తుండిపోతుందని విద్యార్థులు ఆనందంతో అభిప్రాయాలను వెల్లడించారు. సాంకేతిక విద్యలో నిత్యం పరిశోధన వైపు పరుగెడుతున్న తరుణంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులపై వుండే ఒత్తిడి తగ్గుతుందని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ పేర్కొన్నారు. పూర్వీకులు వినియోగించిన మట్టి వస్తువుల ప్రాముఖ్యతను, ప్రాచీన కళలను భవిష్యత్ తరాలకు కూడా తెలిపేందుకు ఈ కార్యక్రమం విద్యార్థుల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాస రావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జిల్లా అధికారుల బృందం పర్యటన



సూచనలు అందజేస్తున్న జిల్లా అధికారులు

గుంటూరు రూరల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం డీఈయూ రమేష్ తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలం నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో జిల్లా బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, ఇంకుడు గుంతలు సామూహిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా బృందం పర్యటించటం జరిగిందన్నారు. గ్రామాలను పరిశీలించి దేశ స్థాయిలోనే ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు తగిన సూచనలు, సలహాలు సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగపు ఏఈ వినీల్ కుమార్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్స్ షఫీ, సాయి, స్వచ్ఛ భారత్ ఎంఆర్‌సీ డి.శ్రీనివాసరావు, నడింపాలెం పంచాయతీ కార్యదర్శి ఖాజా, నడింపాలెం, తుమ్మలపాలెం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ రోహిణి, నాగరాజు, ఐటీసీ ప్రతినిధులు అరుణ, ఉమామహేశ్వరీ పాల్గొన్నారు.

రసవత్తరంగా రెండవరోజు స్కూల్ గేమ్స్



గుంటూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అథ్లెటిక్స్, క్రీడా ఎంపికలు బుధవారం కొనసాగాయి. ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న క్రీడలు ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా క్రీడా స్ఫూర్తితో జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని 5 మండలాల్లో వివిధ పాఠశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారని నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి.డేవిడ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలను పూర్తి చేయటంలో నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ సహకరించారన్నారు. వారందరికీ స్కూల్ గేమ్స్ కార్యదర్శి గాదె ప్రతాప్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు అథ్లెటిక్స్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్ తదితర పోటీలను నిర్వహించారు.

వర్సిటీకి అంతర్జాతీయంగా కీర్తి తేవడమే లక్ష్యం

ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి అంతర్జాతీయంగా కీర్తి తేవడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపక సంఘం బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో విద్యా విషయక, పరిశోధన, క్రీడా, సాంస్కృతిక రంగాలలో యూనివర్సిటీ కీర్తిని మరింత నుమడింపజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఎన్నో సంస్కరణలు చేపట్టామన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, యూనివర్సిటీ అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు వీసీ చేపడుతున్న చర్యలను అభినందించి, పుష్పగుచ్ఛాలు అందించారు. ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి, ఆచార్య గంగాధర్, ఆచార్య ఇ.శ్రీనివాస రెడ్డి, ఆచార్య పి.సిద్దయ్య, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, పలువురు అధికారులు, సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

సైన్ బోర్డుల ఏర్పాటుకు సంయుక్త చర్యలు



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని విద్యా సంస్థలు, హాస్పిటల్స్ వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటుకు ట్రాఫిక్, విద్యాశాఖ, జీఎంసీ సంయుక్త చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం కమిషనర్ ఆధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ కాంగ్రెస్ నిబంధనల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసు, విద్యా శాఖ, ట్రాన్స్‌పోర్ట్, జీఎంసీ సంయుక్తంగా పలు చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా విద్యా సంస్థలు, హాస్పిటల్స్ వద్ద నో హారన్, నిదానంగా వెళ్లండి అనే సైన్ బోర్డ్‌లు, అవ సరం మేరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రధాన జంక్షన్‌ల వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ ను ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో జీఎంసీ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణ చేయాలని, మరమ్మతులు అవసరమైన వాటి వివరాలు ట్రా ఫిక్ పోలీసులు ఇవ్వాలన్నారు. ప్రధాన రహదారుల వెంబడి వాహనదారులకు అసౌకర్యంగా ఉండే హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలన్నారు. ఫుట్ పాత్‌లు, ప్రధాన జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే ఆక్రమణలను నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం తొలగిస్తుందని, ట్రాఫిక్ పోలీసులు ప్రణాళిక విభాగానికి సహకరించాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కరీం, డీఈఓ శైలజ, ఆర్ అండ్‌బీ డీఈఈ నాగిరెడ్డి, ట్రాఫిక్ సీఐ అక్కేశ్వరరావు, ఈఈలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై పొలంబడి



గోళ్ళమూడిలో వరి సాగు పద్ధతులపై పొలంబడిలో ఏడీఏ టి.శ్రీనివాసరావు, ఏఓ, రైతులు

పెదకాకాని: రైతులు వరిపైరులో ప్రస్తుతం రసాయన పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా శత్రుపురుగులను ఆహారంగా తినే మిత్ర పురుగులన్నీ చనిపోతాయని ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోళ్ళమూడి గ్రామంలో బుధవారం జరిగిన వరి పంటలో పొలంబడి కార్యక్రమానికి వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుంటూరు సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిపైరులో శత్రు పురుగుల నివారణకు వేపగింజల కషాయం పైరుపై పిచికారీ చేయాలన్నారు. వరిపంట పిలకల దశలో ఉందన్నారు. పొలంలో పది మొక్కల దుబ్బులను పరిశీలించారు. క్షేత్ర దీర్ఘకాల అధ్యయనాల పొలంబడి రైతుల చేత ప్రయోగాత్మకంగా పిలకలు తొలగింపు చేశారు. వరిలో కాండం తొలచు పురుగు వలన కొన్ని పిలకలు నష్టపరచినా వరిమొక్కకు తిరిగి పిలకలు తొడిగే సామర్థ్యం ఉందన్నారు. వరి పంటలో అధికంగా ఉన్న నీటిని తీసివేసి 2–3 సెంటీమీటర్లు నీరు మాత్రమే ఉంచాలన్నారు. తద్వారా వరి మొక్క అధికంగా పిలకలు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్‌వీ శివాజీ, వీపీఏలు వి.విజయలక్ష్మి, గ్రామ వలంటీర్లు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

రూ.22 లక్షలతో చేపట్టే పనులకు శ్రీకారం



అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల ఏర్పాటుకు పూజ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు భద్రత చర్యలను చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం డాక్టర్ పాదిల ప్రసాద్ బ్లాక్ లోని అండర్ గ్రౌండ్‌లో రూ. 22 లక్షలతో అగ్ని ప్రమాదాల నివారణ కోసం చేయనున్న పనులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అగ్ని భద్రత పరికరాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదాలను తగ్గించడానికి మరమ్మతులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, ఎలక్ట్రికల్ ఏఈ దస్తగిరి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు అవయవదానంపై ర్యాలీ

గుంటూరు జీజీహెచ్‌లో గురువారం ఉదయం 8 గంటలకు అవయవ దానం, ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అవయవ ప్రతిజ్ఞతో పాటు పేర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

దాతల వితరణ

గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. నాదెండ్ల రాంబాబు, కుమార్తె వైష్ణవిలు ప్లాస్టిక్ బెడ్స్ కాక్ ట్యాప్‌లు సూపరింటెండెంట్‌కు బుధవారం అందచేశారు. ఆసుపత్రిలో జరుగు తున్న అభివృద్ధి పనులకు తమ వంతు సహకారంగా దాతలు ఈ ట్యాప్‌లను అందచేశారని డాక్టర్ కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, పలువురు నర్సింగ్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువతి మృతి

మంగళగిరి: భర్త వేధింపులు తట్టుకోలేక పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని కురగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పో లీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బత్తుల గౌతమి(26) యర్రబాలేనికి చెందిన దానబోయిన హరికృష్ణతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఈ నెల 15వ తేదీన కురగల్లులోని తమ పుట్టింటికి వెళ్లింది. భర్త హరికృష్ణ, కుటుంబ సభ్యులు పంచాయతీ పేరుతో బస్టాండ్ సెంటర్‌లో గౌతమిని ఆమె కుటుంబ సభ్యులను అవమానపరచేలా వ్యవహరించారు. దీంతో మనస్తాపానికి గురయిన గౌతమి ఈనెల 21వ తేదీన పుట్టింటి వద్ద పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.

నియోజకవర్గంలో దుష్ప్రచారాల పార్టీగా టీడీపీ

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో టీడీపీ దుష్ప్రచారాల పార్టీగా మారిందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. బుధవారం ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ టీడీపీ నాయకులు అవాస్తవాలను మాట్లాడుతూ నిరంతరం ప్రజలను మోసగించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. సీఐడీ విచారణతో నిజం నిర్ధారణయి వాళ్ల నాయకుడు చంద్రబాబు స్కిల్ స్కాం కేసులో జైలుకెళ్లిన విషయాన్ని ప్రజలందరూ గ్రహించారన్నారు. టీడీపీ నాయకులు సైతం చంద్రబాబు చేసిన తప్పును తెలుసుకున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తమ ఉనికిని చాటుకునేందుకు స్థానిక టీడీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారని విమర్శించారు. స్కిల్ స్కాంపై పూర్తి ఆధారాలను చూపిస్తామని అసెంబ్లీలో చర్చకు రమ్మని పిలిస్తే టీడీపీ ఎమ్మెల్యేలు దమ్ము, ధైర్యంలేక పారిపోయారన్నారు. పట్టణంలో అర్థం లేని కార్యక్రమాలను చేపడుతున్నారని వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సీమెన్స్ కంపెనీ పేరు చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సీమెన్ష్ కంపెనీ సాఫ్ట్‌వేర్‌ను ప్రపంచానికి ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఏ వెబ్‌సైట్‌లో వెతికిన ఆ కంపెనీ గురించి అర్థమవుతుందని చెప్పారు. ఆ కంపెనీ పేరు వాడుకొని చంద్రబాబు డబ్బులు కాజేశాడని స్పష్టమైన ఆధారాలతో రుజువైందన్నారు. సీమెన్స్ కంపెనీ ఉచితంగా శిక్షణ అందించే స్కిల్ సెంటర్‌ను నరేంద్ర పరిశీలిస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. పొన్నూరులో దొంగ దీక్షలు చేయడం, ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారని చెబుతూ ప్రజల సింపతీ పొందేందుకు టీడీపీ నాయకులు ఎన్నో కష్టాలు పడుతున్నారని విమర్శించారు. పొన్నూరు ఐలాండ్ సెంటర్లోని వ్యాపార కూడలిలో గత పది రోజుల నుంచి దీక్షలు చేస్తుండటంతో, ఆ శిబిరం వెనక ఉన్న వ్యాపారులు తమ వ్యాపారాలను కోల్పోయి నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు దుష్ప్రచారాలను మానుకోవాలని హితవుపలికారు.

అనుమతుల్లేని సేంద్రియ ఉత్పత్తులు సీజ్



ఉత్పత్తులను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

పొన్నూరు: మండలంలోని కట్టెంపూడి గ్రామంలో అనుమతులు లేకుండా సేంద్రియ ఉత్పత్తులు తయారు చేస్తున్న ఎస్ఎల్ఎన్ చంపాక్ కంపెనీపై గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బుధవారం దాడులు నిర్వహించారు. వ్యాపార లైసెన్సు, సేంద్రియ ఉత్పత్తులు తయారు చేయడానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఉత్పత్తులు తయారు చేస్తున్నారని విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ. కోటి మూడు లక్షల విలువ చేసే ఉత్పత్తులను సీజ్ చేశారు. కంపెనీ నిర్వాహకుడు రమా రంజన్ బాబుపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడులలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామచంద్ర రెడ్డి, ఏవో రమణ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ సదస్సు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారులోని లాం నందున్న కళాశాలలో గత మూడు రోజులుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్‌పై శిక్షణ సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో ఎటువంటి ప్రాజెక్ట్‌లనైనా సులువుగా తయారు చేయవచ్చన్నారు. ఉద్యోగాలను సాధించవచ్చన్నారు. రోబోటిక్ టెక్నాలజీకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు కళాశాలలో నిర్వహించటం ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెపొందించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.నాగగోపి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పక్షుల కేంద్రం చైర్మన్ అనిల్‌కుమార్

పెదకాకాని: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో చైర్మన్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి పక్షులు ఉప్పలపాడు రావడం మనం అదృష్టంగా భావించాలన్నారు. పక్షులకు ఎటువంటి హాని తలపెట్టకుండా ఉండాలన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



ధ్రువపత్రాన్ని లారా ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదాను కల్పిస్తూ న్యూఢిల్లీలోని యూజీసీ ఉపకార్యదర్శి గోపీచంద్ మేరుగు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించడం వలన స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కోర్సులను, సొంత పాఠ్య ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడంతో పాటు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, డిగ్రీలను ప్రదానం చేయవచ్చన్నారు. ఈ అటానమస్ హోదా 2023–24 అకడమిక్ విద్యా సంవత్సరం నుంచి 2032–33 (10 సంవత్సరాల) పాటు లభించిందని తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు మెరుగైన విద్యాబోధనకు కృషి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే లారా కళాశాలకు నాక్ ఏ+ అక్రిడిటేషన్‌తో పాటు ఐదు ఇంజనీరింగ్ ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ కూడా ఉన్నాయన్నారు. అటానమస్ హోదా ధ్రువపత్రాన్ని చైర్మన్ లావు రత్తయ్య కళాశాల ప్రిన్సిపాల్ కె.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బందికి అందజేసారు.

కుల వివక్షపై గళం విప్పిన గుర్రం జాషువా

పెదకాకానిలో జాషువా 128వ జయంతి వేడుకలు

పెదకాకాని: కుల వివక్షత పై కలంతో గళం విప్పిన కవి గుర్రం జాషువా అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నన్నపనేని శివాజీ మాట్లాడుతూ జాషువా రచనలన్నీ ప్రజలను అభ్యుదయ సాహిత్యం వైపు నడిపించేలా రచించారన్నారు. ఫిరదౌసి, గబ్బిలం వంటి రచనలతో దళితులు, పేదల స్థితిగతులను కళ్లకు కట్టినట్లు వివరించారన్నారు. జాషువా సాహిత్యం నేటి తరానికి, ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి సనాతన ధర్మం వంటి వాటిపై పోరాడే వారికి ఆయుధం వంటిదన్నారు. జాషువా సాహిత్యంతో ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.సత్యనారాయణ, కె.సాంబయ్య, ఎస్.నీలాంబరం, కె.రాఘవయ్య, ఎ.నాగేశ్వరావు, గౌరీ, వెంకటరమణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పాత గుంటూరు: దేవాదాయ శాఖ పరిధిలోని కొత్తపేట జగన్నాథ స్వామి దేవస్థానం, ఆంజనేయ స్వామి దేవస్థానం, లాలాపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను బుధవారం లెక్కించగా మూడు నెలలకు గాను రూ.8,01,229 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. జగన్నాథ స్వామి ఆలయానికి రూ.7241, ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.3,34,973, వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.4,59,015 హుండీలలో భక్తులు కానుకల రూపంలో సమర్పించగా ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యాగ పూర్ణాహుతి

ఆర్.అగ్రహారంలోని శ్రీ వాసవి యూత్ ఆధ్వర్యంలో 25వ శ్రీ విజయ గణపతి స్వామి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం గణపతి హోమం, నవగ్రహ హోమం, యాగ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా సామ్రాజ్య పట్టాభిషేకం, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు.